

ఎన్నికల సిబ్బందికి సూచనలు, సలహాలిస్తున్న వికారాబాద్ అదనపు కలెక్టర్ లింగ్యానాయక్

## లోక్‌సభ ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి

**వికారాబాద్ అదనపు కలెక్టర్ లింగ్యానాయక్**

కొడంగల్, మే 11 : లోక్‌సభ ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు పూర్తైనట్లు వికారాబాద్ అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ తెలిపారు. శనివారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పీవో, ఏపీవో, ఓపీవోలతో ప్రత్యేకంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలో 2,41,749 మంది ఓటర్లుండగా.. 282 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామని.. పీవో, ఏపీవో, ఓపీవోలను 1350మంది సిబ్బంది నియమించినట్లు తెలిపారు. అదేవిధంగా 104 మంది సెక్టోరియల్ అధికారులు, ఎన్నికల సిబ్బంది ఈవీఎంల తరలింపునకు 90 బస్సులు, ఇతరాత్ర వాహనాలు అందుబాటులో ఉంచినట్లు చెప్పారు. 150 డిస్ట్రిబ్యూషన్ సెంటర్లు, ఓటేసేందుకు 1450 ఈవీఎంలు, 146 వెబ్ కాస్టింగ్ కేంద్రాలు, 76 కేంద్రాల్లో సీపీ కెమెరాలు ఏర్పాటు చేశామన్నారు. ఈవీఎంల మరమ్మతులకు ముగ్గురు ఈసీఎల్ఐ ఇంజినీర్లు, ఎంపీడీవో, ఎంపీవో, ఏపీవో, మెడికల్ అధికారులు, ఇతరాత్ర సిబ్బంది అందుబాటులో ఉంటారన్నారు. అన్ని పోలింగ్ కేంద్రాలను కలిపి 29 రూట్లుగా విభజించామన్నారు. దివ్యాంగులు, వృద్ధుల కోసం ప్రత్యేకంగా ఆటోలు, సహాయకులను ఏర్పాటు చేశామన్నారు. 91 పోస్టల్ బ్యాలెట్‌లుండగా అందులో 85 మంది సద్వినియోగం చేసుకున్నట్లు తెలిపారు.



విశ్వనాథ్‌గౌడ్‌ను సన్మానిస్తున్న ఆర్టీసీ ట్రైనింగ్ కళాశాల ప్రిన్సిపాల్ సుధా పరిమళ

## తలంబ్రాల బుకింగ్‌లో మొదటి స్థానంలో పరిగి

పరిగి, మే 11: భద్రాచలంలోని సీతారాముల వారి కల్యాణ తలంబ్రాల బుకింగ్‌లో పరిగి ఆర్టీసీ డిపో రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలిచింది. పరిగి డిపో తరపున 1777 తలంబ్రాల బుకింగ్‌లు చేశారు. ఈ మేరకు శనివారం హైదరాబాద్‌లోని హకీంపేట టీఎస్‌ఆర్టీసీ ట్రైనింగ్ కళాశాల ప్రిన్సిపాల్ సుధాపరిమళ, హైదరాబాద్ జోన్ డిప్యూటీ సీటీఎం బాబూనాయక్, గ్రేటర్ హైదరాబాద్ జోన్ సీటీఎం మధుసూదన్‌లు పరిగి డిపో మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ విశ్వనాథ్ గౌడ్‌ను సన్మానించారు. పరిగి డిపోను తలంబ్రాల బుకింగ్‌లో అగ్రస్థానంలో నిలిపినందుకు ఆయన్ను అభినందించారు. కార్యక్రమంలో రంగారెడ్డి రీజియన్ ఏటీఎం రవీందర్, లాజిస్టిక్స్ విభాగం అన్ని డిపోల మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్‌లు పాల్గొన్నారు.

## రేగడిమైలారంలో వాలీబాల్ పోటీలు

బొంరాస్‌పేట, మే 11 : మండలంలోని రేగడిమైలారంలో శనివారం వాలీబాల్ పోటీలు నిర్వహించారు. విజేత జట్టుకు జానపద కళాకారుల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కృష్ణయ్య బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆటలపై యువత ఆసక్తి చూపాలన్నారు. కార్యక్రమంలో వెంకటయ్య, కాశప్ప, వెంకటేశ్, సురేశ్, శివ పాల్గొన్నారు.

# మినీ ట్యాంక్‌బండ్‌గా లఖ్నాపూర్

**బీఆర్ఎస్ హయాంలో మారిన ప్రాజెక్టు రూపురేఖలు**

**ఉమ్మడి రాష్ట్రంలో నిరాదరణ..**

**అభివృద్ధికి బడ్జెట్‌లో నిధుల కేటాయింపు నిల్**



లఖ్నాపూర్ ప్రాజెక్టు

పరిగి, మే 11 : ఉమ్మడి రాష్ట్రంలో నిర్మాణం పూర్తైన లఖ్నాపూర్ ప్రాజెక్టు నిరాదరణకు గురైంది. పట్టించుకునే వారు లేక నీటి నిల్వ సామర్థ్యం తగ్గిపోయింది. అయితే అధి కారంలోకి వచ్చిన బీఆర్ఎస్ ప్రభుత్వం దాని రూపురేఖలను మార్చివేసింది. ఏకం గా రూ.ఆరు కోట్లతో మినీ ట్యాంక్‌బండ్‌గా తీర్చిదిద్దింది. పరిగి మండలంలోని లఖ్నాపూర్‌లో పరిగి సెగ్మెంట్‌లోని రెండు గ్రామాలు, వికారాబాద్ సెగ్మెంట్లోని ఆరు గ్రామాలకు సాగునీటిని అందించేందుకు దీనిని నిర్మించారు. పేరుకు ప్రాజెక్టు నిర్మా ణం జరిగినా, ఆ తర్వాత దాని అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చం దంగా మారింది. ప్రాజెక్టు పరిధిలో సాగు విస్తీర్ణం సుమారు 2400 ఎకరాలుండగా వాస్తవానికి పావు వంతుకు పైగా సాగు విస్తీర్ణం తగ్గిపోయింది. ప్రతి ఏటా ఉమ్మడి రాష్ట్ర బడ్జెట్‌లో లఖ్నాపూర్ ప్రాజెక్టు అభివృద్ధికి నిధులు కేటాయింపు జరుగుతుందని ఆశించినా ఫలితంలేదు.

**మారిన రూపురేఖలు..**

బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రతి నియోజకవర్గానికీ ఒకటి చొప్పున మినీ ట్యాంక్ బండ్‌ను నిర్మించాలని సంకల్పించింది. అందులో భాగంగానే లఖ్నాపూర్ ప్రాజెక్టును మినీ ట్యాంక్‌బండ్‌గా తీర్చిదిద్దాలని భావించింది. అందు కోసం రూ.6 కోట్లను ఖర్చుచేసింది. ముందుగా ప్రాజెక్టు కట్టను వెడల్పుగా పటిష్టం గా చేపట్టారు. ఉదయం, సాయంత్రం సమయాల్లో వాకింగ్ చేసేందుకు వీలుగా కట్టకు ఇరువైపులా రెయిలింగ్‌తోపాటు వాకింగ్ ట్రాక్‌ను నిర్మించారు. అంతేకాకుం డా ప్రతి ఏటా వినాయకచవితి సందర్భంగా పరిగి పట్టణంతోపాటు మండలంలోని పలు గ్రామాల్లో ప్రతిష్ఠించే వినాయక ప్రతిమలను నిమజ్జనం చేసేందుకు వీలుగా గణేశ్‌ఘాట్ నిర్మాణం, బతుకమ్మ పండుగ సందర్భంగా బతుకమ్మల నిమజ్జనానికి ప్రత్యేకంగా మెట్లను ఏర్పాటు చేశారు. ప్రాజెక్టులో బోటింగ్ ఏర్పాటుకు చర్యలు తీసుకున్నారు. జెట్టి ల్యాండింగ్‌నూ నిర్మించారు. అలాగే ప్రాజెక్టులో పేరుకుపోయిన సిల్ట్‌ను తొలగించి నీటి నిలువ సామర్థ్యాన్ని పెంచారు. ప్రాజెక్టులో నీరు ఎక్కువ రోజులు ఉండేలా మిషన్ భగీరథ వృథా నీరంతా ఇందులోకి వచ్చేలా చూసి.. చేప పిల్లల పెంపకం ద్వారా మత్స్యకారులకు ఉపాధితోపాటు రెండు పంటలకు సాగునీరు అందించాలన్నది గత బీఆర్ఎస్ ప్రభుత్వ ఆలోచన. ప్రస్తుతం లఖ్నాపూర్ ప్రాజెక్టులో నీరు పూ ర్తిగా తగ్గిపోయింది. భారీ వర్షాలు కురిస్తేనే ప్రాజెక్టులోకి నీరు వచ్చే అవకాశమున్నది. ఏదిఏమైనా లఖ్నాపూర్ ప్రాజెక్టు ఉమ్మడి రాష్ట్ర పాలనలో నిరాదరణకు గురికాగా.. బీఆర్ఎస్ హయాంలో రూపురేఖలు మారాయని స్పష్టంగా చెప్పొచ్చు.




బతుకమ్మ నిమజ్జనం కోసం ఏర్పాటుచేసిన మెట్లు



ప్రాజెక్ట్ వద్ద ఏర్పాటు చేసిన వాకింగ్ ట్రాక్

### లఖ్నాపూర్ అభివృద్ధికి కేసీఆర్ సర్కారు కృషి



గత ఉమ్మడి ప్రభుత్వాలు లఖ్నాపూర్ ప్రాజెక్టును పట్టించుకోలేదు. కేసీఆర్ వచ్చిన తర్వాతే దాని రూపురేఖలు మారాయి. మినీ ట్యాంక్ బండ్‌గా తీర్చిదిద్దింది. కట్ట వెడల్పును పెంచి మరింత పటిష్టంగా నిర్మించింది. దీంతో ప్రాజెక్టులో నీటి నిల్వ సామర్థ్యం కూడా పెరిగింది.

**-మల్లయ్య, రైతు**

## మినీ స్టేడియంలో పోలింగ్ సామగ్రి పంపిణీ

**ఉదయం 7గంటల నుంచి పంపిణీకి ఏర్పాట్లు**



డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌లో ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఆర్డీవో వాసుచంద్ర

పరిగి, మే 11: పార్లమెంటు ఎన్నికల సందర్భంగా పోలింగ్ సామగ్రి పంపిణీకి పరిగిలోని మినీ స్టేడియంలో డిస్ట్రిబ్యూషన్ సెంటర్ ఏర్పాటు చేశారు. ఈ మేరకు ప్రత్యేకంగా పోలింగ్ సిబ్బందికి అందజేసిన సామగ్రిని పరిశీలించేందుకు టేబుల్స్, కుర్చీలు ఏర్పాటు చేయించారు. ఆదివారం ఉదయం 7 గంటల నుంచే డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌లో పోలింగ్ సామగ్రి పంపిణీకి సంబంధించి ఏర్పాట్లు చేపట్టారు. పరిగి అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో మొత్తం 2,66,566 మంది ఓటర్లుండగా వారిలో పురుషులు 1,33,568 మంది, మహిళలు 1,32,989 మంది, ఇతరులు 9 మంది ఉన్నారు. పరిగి నియోజకవర్గంలోని 305 పోలింగ్ కేంద్రాల్లో 305 మంది పోలింగ్ ఆఫీసర్లు, 305 మంది ఏపీవోలు, 710 మంది ఓపీవోలు పోలింగ్ విధులు నిర్వహిస్తారు. మొత్తం 125 పోలింగ్ కేంద్రాల్లో లొకేషన్ కెమెరాలు, 60 కేంద్రాల్లో బయట సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం జరిగింది. 65 మంది మైక్రో అబ్జర్వర్లు పోలింగ్‌ను పర్యవేక్షించనున్నారు. మొత్తం 27 రూట్‌లు ఏర్పాటు చేశారు. ఆదివారం ఉదయం 7 గంటల వరకు పోలింగ్ సిబ్బంది డిస్ట్రిబ్యూషన్ కేంద్రానికి చేరుకోవాలని అధికారులు సూచించారు. పోలింగ్ సిబ్బంది, సామగ్రిని పోలింగ్ కేంద్రాలకు తరలించేందుకు 34 బస్సులు, 29 తుఫాను వాహనాలు ఏర్పాటు చేశారు. మినీ స్టేడియంలోని డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌ను వికారాబాద్ ఆర్డీవో, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి వాసుచంద్ర సందర్శించి ఏర్పాట్లు పర్యవేక్షించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఆనంద్‌రావు పాల్గొన్నారు.



## పోలింగ్‌కు ఏర్పాట్లు

బొంరాస్‌పేట, మే 11 : సోమవారం జరిగే పార్లమెంట్ ఎన్నికల పోలింగ్‌కు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. పోలింగ్ కేంద్రాలలో సిబ్బందికి కావలసిన అన్ని వసతులను అధికారులు ఏర్పాటు చేశారు. పోలింగ్ కేంద్రాలలో సీసీ కేంద్రాలను కూడా ఏర్పాటు చేస్తున్నారు. పోలింగ్ రోజు ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు.

# జోరుగా బీఆర్ఎస్ ఎన్నికల ప్రచారం



ధారూరు : నాగారం గ్రామంలో ఇంటింటికీ ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ధారూరు మండల పార్టీ నాయకులు



అవుసుపల్లి గ్రామంలో ఉపాధి కూలీలను ఓటు అభ్యర్థిస్తున్న ధారూరు మండల బీఆర్ఎస్ పార్టీ నాయకులు

**కాసాని జ్ఞానేశ్వర్‌ను గెలిపించండి**

**ఇంటింటికీ వెళ్లి ఓటు అభ్యర్థించిన పార్టీ నేతలు**

ధారూరు, మే 11: చేవెళ్ల పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్‌ను భారీ మెజార్టీతో గెలిపించుకోవాలని ధారూరు మండల పార్టీ నాయకులు పేర్కొన్నారు. శనివారం ధారూరు మండల పరిధిలోని నాగసముందర్, ధారూరు, ధారూరుస్టేషన్, మోమిన్‌కలాన్, అంపల్లి, మోమిన్‌ఖుర్దు, రాజాపూర్, నాగారం, అంతారం, దోర్నాల్, హరిదాస్‌పల్లి తదితర గ్రామాల్లో ఇంటింటి ఎన్నికల ప్రచారం చేశారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు మాట్లాడుతూ ఆరు గ్యారంటీల పేరుతో ప్రభుత్వాన్ని ఏర్పాటుచేసిన కాంగ్రెస్ ఒక్క హామీ కూడా నెరవేర్చలేదన్నారు. కల్యాణలక్ష్మి, షాదీముబారక్ కింద అదనంగా తులం బంగారం ఇస్తామని చెప్పిన ప్రభుత్వం ఊసెత్తడం లేదన్నారు. ప్రజలను మోసం చేస్తున్న కాంగ్రెస్ పార్టీకి ఈ ఎన్నికల్లో ప్రజలు బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. చేవెళ్ల పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ధారూరు మండల అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శులు అంజయ్య, రాజుగుప్తా, నాయకులు వేణుగోపాల్‌రెడ్డి, నరోత్తంరెడ్డి, సంతోశ్‌కుమార్, వెంకటయ్య, బాల్‌రాజ్‌నాయక్, రాములు, రవీందర్‌రెడ్డి, చంద్రమౌళి, అంజయ్య, గోవింద్ రాజ్‌గౌడ్, లక్ష్మణ్, సుధాకర్‌గౌడ్, చెన్నయ్యగౌడ్, గోపాల్ నాయక్, దేవేందర్, మునీరొద్దీన్, శ్రీశైలం, మాణిక్యం, రాములు, నారాయణ, అనంతయ్య, వీరేశం, వెంకటయ్య, సర్వేశం తదితరులు ఉన్నారు.


**కులకచర్ల :** కులకచర్ల, చౌడాపూర్ మండలాల పరిధిలోని వివిధ గ్రామాల్లో బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు, నాయకులు పార్టీ ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ గెలుపుకోసం ప్రచారం చేశారు. ఉపాధిహామీ కూలీలతో మాట్లాడుతూ కారుగుర్తుకు ఓటు గెలిపించాలని కోరారు. చౌడాపూర్ మండల పరిధిలోని మందిపల్ గ్రామంలో పంచాయతీ రాజ్ చాంబర్ రాష్ట్ర కార్యదర్శి మందిపల్ వెంకట్ ఆధ్వర్యంలో ప్రచారం చేశారు. కార్యక్రమంలో మఠం రాజశేఖర్, నర్సింహులు, చెన్నయ్య, సుధీర్, చెల్లాపూర్ గ్రామంలో మాజీ సర్పంచ్ ఆంజనేయులు, గ్రామ నాయకులు ఆధ్వర్యంలో ప్రచారం చేశారు. అనంతసాగర్ గ్రామంలో బీఆర్ఎస్ కార్యకర్తలు ఉపాధిహామీ కూలీలను కలిసి మాట్లాడారు.

**జ్ఞానేశ్వర్ గెలుపే లక్ష్యం**

దోమ : బడుగు, బలహీన వర్గాల నేత కాసాని జ్ఞానేశ్వర్ చేవెళ్ల గడ్డపై భారీ మెజార్టీతో గెలువడం ఖాయమని వైస్ ఎంపీపీ మల్లేశం అన్నారు. దోమ మండల పరిధిలోని మోత్కూర్ గ్రామంలో ఆయన శనివారం గ్రామ బీఆర్ఎస్ శ్రేణులతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించి కారు గుర్తుకు ఓటు వేయాలని ఓటర్లను కోరారు. దోమ గ్రామంలో సర్పంచ్‌ల సంఘం మండల మాజీ అధ్యక్షుడు రాజిరెడ్డితో కలిసి మాజీ జడ్పీటీసీ లక్ష్మయ్యముదిరాజ్ ఉపాధి హామీ కూలీలను కలిసి కాసాని జ్ఞానేశ్వర్‌ను గెలిపించాలని కోరారు. తిమ్మాయిపల్లి గ్రామంలో బీఆర్ఎస్ కార్యకర్తలు కారు గుర్తుకు ఓటు వేయాలని మహిళలను అభ్యర్థించారు. ప్రచారంలో మోత్కూర్ మాజీ ఉప సర్పంచ్ శ్రీకాంత్‌రావు, మల్లేశ్‌ముదిరాజ్, సుధాకర్‌రెడ్డి, దోమ మాజీ వార్డు సభ్యుడు మైను, సాయిలు, వెంకట్‌రాములు పాల్గొన్నారు.



ధారూరుస్టేషన్ గ్రామంలో కూలీలను కారుగుర్తుకు ఓటు వేయాలని కోరుతున్న ధారూరు మండల బీఆర్ఎస్ పార్టీ నాయకులు



ధారూరు : నాగసముందర్ గ్రామంలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ధారూరు మండల పార్టీ నాయకులు



కులకచర్ల : చెల్లాపూర్‌లో ఉపాధిహామీ పథకం కూలీలను బీఆర్ఎస్‌కు ఓటు వేయాలని అభ్యర్థిస్తున్న బీఆర్ఎస్ నాయకులు



దోమ : మోత్కూర్‌లో రైతును కారు గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థిస్తున్న వైస్ ఎంపీపీ మల్లేశం



దోమ : తిమ్మాయిపల్లిలో మహిళ కు ఓటు వేసే విధానాన్ని వివరిస్తున్న నాయకులు



ఏర్పుమళ్లలో ఉపాధి కూలీలను ఓటు అభ్యర్థిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

## మన్నె శ్రీనివాస్‌రెడ్డిని గెలిపించాలి

బొంరాస్‌పేట, మే 11 : మహమూబ్‌నగర్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న మన్నె శ్రీనివాస్‌రెడ్డిని గెలిపించాలని ఆ పార్టీ మండలాధ్యక్షుడు కోట్ల యాదగిరి, పార్టీ నాయకుడు మహేందర్‌రెడ్డి కోరారు. శనివారం మండలంలోని ఏర్పుమళ్లలో వారు ఎన్నికల ప్రచారం చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అమలు చేసిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి ఓటు అభ్యర్థించారు. బొంరాస్‌పేటలో బీఆర్ఎస్ మండల యూత్ అధ్యక్షుడు మహేందర్, కోఆప్షన్ సభ్యుడు ఖాజా మైనుద్దీన్, బీఆర్ఎస్ నాయకులు సుభాశ్‌రావు, సలాం, అంజిలయ్య, లచ్చప్ప ప్రచారం చేశారు.

## ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నేత కృష్ణయ్య

మర్పల్లి, మే 11: ప్రతి ఒక్కరూ సైనికుడిలా పనిచేసి కాసాని జ్ఞానేశ్వర్‌ను గెలిపించాలని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కృష్ణయ్య పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రంలో విలేకర్లతో మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అమలు కానీ హామీలను ఇచ్చి ఏ ఒక్కటి కూడా అమలు చేయకూండా ప్రజలను మోసంచేసిందని అన్నారు. గత పార్లమెంట్ ఎన్నికల్లో చేవెళ్ల బీఆర్ఎస్ నుంచి రంజిత్‌రెడ్డికి కేసీఆర్, కేటీఆర్ ఎంతో ప్రాధాన్యతనిచ్చి గెలిపిస్తే పార్టీకి నమ్మక ద్రోహం చేసి కాంగ్రెస్‌లో చేరాడన్నారు. బీసీ కులాల అభ్యున్నతికి కృషి చేస్తున్న కాసాని జ్ఞానేశ్వర్‌ను గెలిపించాలని ఆయన కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం 5నెలల పాలనలో కరెంటు కష్టాలు, మంచి నీటి సమస్యలు మొదలయ్యాయని ఆరోపించారు. సమావేశంలో మండల కార్మిక సంఘం నాయకుడు కిరణ్ కుమార్, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

## విద్యుదాఘాతంతో ఫర్టిలైజర్ దుకాణం దగ్ధం

వికారాబాద్, మే 11 : షార్ట్ సర్క్యూట్‌తో ఫర్టిలైజర్ షాపు దగ్ధమైన ఘటన వికారాబాద్ పట్టణంలో శుక్రవారం రాత్రి జరిగింది. పట్టణంలోని కొత్త గంజ్ పరిధిలో ధనలక్ష్మి ఫర్టిలైజర్ దుకాణంలో విద్యుదాఘాతం ఏర్పడింది. దీంతో తీవ్ర నష్టం వాటిల్లినట్లు ఫర్టిలైజర్ దుకాణం యజమాని మధుసూధన్‌రెడ్డి తెలిపారు. వికారాబాద్ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు బాధితుడు పేర్కొన్నాడు.

**PUBLIC NOTICE**

The general public is hereby informed that my client is Intending to purchase the Open plot bearing No. 12, admeasuring 288.88 Sq. Yards, in Sy. Nos. 38, 39, 44/అ, 42/ఆ and 42/ఇ. situated at Vaishnavi Nagar Colony, Kanakamamidi Village and Gram Panchayat, Moinabad Mandal, R.R.District, from Its owner Sri. Dr. Srivathsava Vanga Pandu, S/o. V. Krishna Murthi Rep. by his GPA (vide document No. 2259/2024) holder Sri. Mr. Srinivas Thanniru, S/o. Ramakrishna Rao, for a valuable sale consideration. My client has already paid substantial amount as part sale consideration, by entering into an agreement with its owner Rep. by GPA holder. My client intends to complete the sale transaction by paying the balance sale consideration within a short period. If anyone has any objections for the above said transactions or if there are any third-party claims over the above said Plot, they may contact me with relevant documents, within 7 days from the date of publication of this notice. Inspite of this notice if no objections/third-party claims are received, my client will proceed to complete the sale transaction, treating that there are no objections from anyone and there are no third-party claims over the above said Plot.

**A. SRIDHAR,** Advocate.
Union Bank of India Building, P.S.Complex, 1st Floor, Moinabad, R.R.District-501 504.
Cell No. 8977793417.
Date: 11-05-2024. Place: Moinabad.